కాంగ్రెస్ నాచారం డివిజన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్‌గౌడ్



నియామకపు ఉత్తర్వులను అందుకుంటున్న శ్రీకాంత్‌గౌడ్

మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ నాచారం డివిజన్ అధ్యక్షుడిగా బండారం శ్రీకాంత్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. త్వరలో రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు కృష్ణారెడ్డి, రాంరెడ్డి, సత్తయ్య యాదవ్, బండారి రఘు, భద్రయ్య, వెంకట్, రాజు, మహేష్ యాదవ్, టోని ఫ్రాన్సిస్, నరేష్, గద్ద క్రాంతి తదితరులున్నారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయండి

అల్వాల్: మల్కాజిగిరి లక్ష్మీసాయి గార్డెన్స్‌లో ఈ నెల 4వ తేదీన నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ కుటుంబసభ్యుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు, ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షులు శంబీపూర్ రాజులు హాజరు కానున్నారన్నారు. వివరాలకు 9133999507, 9154959932 నెంబర్లకు ఫోన్ చేయవచ్చు.

సమస్యల పరిష్కారానికి కృషి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే

రామంతాపూర్ : శిథిలావస్థలో ఉన్న స్థానిక ఇందిరానగర్‌లోని ప్రభుత్వ ఉర్దూ ప్రైమరీ పాఠశాలను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సందర్శించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న పరిస్థితులు తెలుసుకోవడానికి అన్ని పాఠశాలలను సందర్శిస్తున్నానన్నారు. ఉర్దూ స్కూల్ పాఠశాలకు కావాల్సిన మౌలిక సౌకర్యాలను త్వరలో కల్పించే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టీఆర్ఎస్ సీనియర్ నేత గంధం నాగేశ్వర్‌రావు,శ్రీకాంత్‌గౌడ్, శంకర్, పవన్, సాలార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యేకు స్కూల్ సమస్యలు వివరిస్తున్న దృశ్యం

రామంతాపూర్ : జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలో నెలకొన్న పలు సమస్యలను ప్రధానోపాధ్యాయులు లత ఆయన దృష్టికి తెచ్చారు. ముఖ్యంగా అదనపు తరగతి గదులతో పాటు తాగునీటికి నల్ల కనెక్షన్ ఏర్పాటు చేయాలని ఆమెకోరారు. అందుకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తారని హామీనిచ్చారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ మాజీ కోఆప్షన్ మెంబర్



మల్లాపూర్: నాచారం చెందిన బీఆర్ఎస్ పార్టీ జీహెచ్ఎంసీ మాజీ కోఆప్షన్ సభ్యురాలు, సెయింట్ పీటర్స్ స్కూల్ ఫౌండర్ విద్యాస్రవంతి కాంగ్రెస్ పార్టీ లో చేరారు. శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వివి.రాజ్, రాజ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

‘అనురాగ్’లో లీడర్‌షిప్ ఎక్సలెన్స్ సెమినార్



ఘట్‌కేసర్: అనురాగ్ యూనివర్సిటీలో ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల నాయకత్వ లక్షణాలను గుర్తించడానికి శుక్రవారం ‘లీడర్‌షిప్ ఎక్సలెన్స్ ఇన్ ఇన్వెస్టిచర్’ సెమినార్ నిర్వహించారు. డీన్ విజయ్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి సెమినార్‌ను ప్రారంభించారు. అనంతరం సెమినార్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ విష్ణుమూర్తి, ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సైకిళ్ల దొంగ

ఉప్పల్: ఉప్పల్‌లో తాళం వేసి ఉన్న ఇళ్లల్లో ఉన్న సైకిళ్లను చోరీ చేస్తున్న వ్యక్తిని ఉప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సరూర్‌నగర్ ప్రాంతానికి చెందిన ఓం ప్రకాశ్ (60) ఉప్పల్‌లోని కాలనీల్లో కాంపౌండ్ వాల్ లోపల పార్కు చేసిన సైకిళ్లను దొంగిలిస్తున్నాడు. ఇతను దొంగిలిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదు కావడంతో శుక్రవారం స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. 100 కి పైగా సైకిళ్లు మాయమైనట్లు, వాటిని ఇతనే దొంగిలించాడా అన్న వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

ఆస్పత్రిలో భయం.. భయం

- శిథిలావస్థకు చేరిన గోడలు
- పెచ్చులూడుతున్న స్లాబ్



ఉప్పల్ ప్రాథమిక వైద్య కేంద్రం

ఉప్పల్: ఉప్పల్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆగమాగంగా మారింది. ఎక్కడ చూసినా శిథిలావస్థకు చేరిన గోడలు, పెచ్చులూడుతున్న స్లాబ్, ఎప్పుడు ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుందోనన్న భయం ఇటు రోగుల్లో, వైద్య సిబ్బందిలో నెలకొంది. ఇన్నాళ్లు ఎలాగో నెట్టుకొచ్చిన వైద్య సిబ్బంది ఇక ఇక్కడ ఉండలేమని వాపోతున్నారు. ఇదిలా ఉంటే ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేవని ఆసుపత్రి వైద్యాధికారే స్వయంగా చూపించడం చర్చనీయాంశంగా మారింది. చిరిగి పోయిన బెడ్‌లు, పెచ్చులూడిపడుతున్న స్లాబ్‌లు, విరిగి పోయిన ల్యాబ్ డోర్‌లు.. ఇలా ఆస్పత్రికి వచ్చిన రోగులు తీవ్ర అసౌకర్యాలకు గురి కావాల్సి వస్తోందని రోగుల సహాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస సదుపాయాలు ఆసుపత్రిలో కరువయ్యాయని చెప్పుకొచ్చారు. గత రెండు రోజుల క్రితం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్వయంగా ఆసుపత్రిని సందర్శించి వసతులపై ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ఆసుపత్రిని సందర్శించారు. వైద్యాధికారి డా. సౌందర్యలతను వసతులపై అడిగి తెలుసుకున్నారు. దీంతో అక్కడున్న సమస్యలను అధికారి కార్పొరేటర్‌కు క్షుణ్ణంగా వివరించారు. ఇదే విషయాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి కార్పొరేటర్ వివరించినట్లు తెలిపారు.

దశాబ్దకాలంగా ఇలాగే నెట్టుకొస్తున్నారు...

ఇంతటి ప్రాశస్త్యం ఉన్న ఆసుపత్రిని 1977 లో నిర్మించారు. ఉప్పల్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం ఎప్పుడో దశాబ్దం క్రితమే శిథిలావస్థకు చేరుకుంది. కొన్నాళ్లు అలాగే నెట్టుకొచ్చిన సిబ్బంది శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని అరకొరగా రిపేర్లు చేస్తూ నెట్టుకుంటూ వస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనంపైనే మరొక షెడ్ నిర్మాణం చేశారు. అయినా రోజుకోచోట డొల్లతనం కనబడుతునే వస్తుంది.

ఉప్పల్‌లో ఒకే ప్రభుత్వ ఆసుపత్రి

ఉప్పల్ వైద్యకేంద్రం దాదాపుగా చుట్టు పక్కల ప్రాంతాలకు కలిపి ఒకే ఒక్క పెద్ద దిక్కు. ఈ వైద్యకేంద్రం ఆధ్వర్యంలో 11 బస్తీ దవాఖానాలు, నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు మల్లాపూర్, వెంకటరెడ్డినగర్, కొత్తపేట, నాగోల్‌లో పని చేస్తున్నాయి. 10 ఉప కేంద్రాలు ఉన్నాయి. ఈ మధ్య కాలంలోనే మూడు పల్లె దవాఖానాలు కూడా మంజూరయ్యాయి. దాదాపుగా 30 పైగా సిబ్బంది పని చేస్తున్నారు.

వసతుల కల్పనకు కృషిచేస్తా : ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

స్వయంగా వెళ్లి పరిశీలించిన తరువాతే విషయాలు బయటకు వచ్చాయి. వసతుల పై ఆరా తీయాలని కార్పొరేటర్‌కు చెప్పాను. ఆసుపత్రి శిథిలావస్థకు చేరిన విషయాన్ని ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకు వస్తాను. మంత్రి ద్వార వసతులు, కల్పించడానికి కృషి చేస్తా.

జన్మదిన శుభాకాంక్షలు



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 3వ డివిజన్ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్ పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా ఉంటూ సమస్యలు పరిష్కరించడంలో చందర్‌గౌడ్ కీలక పాత్ర పోషించారన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో కార్పొరేటర్లు సింగిరెడ్డి పద్మారెడ్డి, సుమన్ నాయక్, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి, చీరాల నర్సింహ తదితరులున్నారు.

సీఐకు సత్కారం

మౌలాలి: నేరేడ్‌మెట్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన సందీప్‌కుమార్‌ను శుక్రవారం కార్పొరేటర్ రాజ్యలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినాయక్‌నగర్ డివిజన్ నేతలు సాయి, సురేష్, మహేష్, నరేందర్ పాల్గొన్నారు.

ఎన్ఆర్ఎస్‌సీ సెంటర్‌ను సందర్శించిన విద్యార్థులు



పోటీల్లో బహుమతులు గెలుపొందిన విద్యార్థులు

బోడుప్పల్: చెంగిచర్లలోని బీఎంఆర్ఎస్ గ్రామర్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులు బుధవారం జీడిమెట్లలోని ఇస్రో అనుబంధ సంస్థ అయిన నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌ను సందర్శించారు. ఎన్ఆర్ఎస్‌సీ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు ఇస్రో గురించి వివరించారు. శాటిలైట్‌ను ఏ విధంగా నిర్ణీత కక్షలోకి ప్రవేశపెడతారు, శాటిలైట్ ఉపయోగాలు, వివిధ శాటిలైట్‌ల గురించి వివరించారు. విద్యార్థులు వివిధ శాటిలైట్‌ల నమూనాలను తిలకించారు. స్వచ్ఛ భారత్‌పైన విద్యార్థులకు కాంపిటీషన్, క్వశ్చన్‌అవర్ కాంపిటేషన్స్ నిర్వహించారు. ఇందులో బీఎంఆర్ఎస్ స్కూల్ విద్యార్థులు అనూష ప్రథమ బహుమతి పొందగా, నవతేజ్‌రెడ్డి గెలుపొందారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జైపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గద్దర్ అవార్డులు ప్రకటించడం హర్షణీయం

అల్వాల్: ప్రజాగాయకుడు గద్దర్ జయంతి పురస్కరించుకొని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సినీ ప్రముఖులకు, కళాకారులకు, రచయితలకు అందించే నంది అవార్డు స్థానంలో గద్దర్ అవార్డులను ప్రకటించడం హర్షణీయమని గద్దర్ అభిమానుల సంఘం నాయకులు తెలిపారు. శుక్రవారం వెంకటాపురం అంబేద్కర్‌నగర్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గద్దర్ అభిమానుల సంఘం అధ్యక్షులు సిఎల్.యాదగిరి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ అవార్డులను ప్రకటించడం స్వాగతిస్తున్నామన్నారు. అదేవిధంగా ట్యాంక్‌బండ్ వద్ద గద్దర్‌ర్ విగ్రహం ఏర్పాటుచేయాలని, మెదక్ జిల్లాకు గద్దర్ జిల్లాగా పేరు మార్చాలని, ఐదు ఎకరాల స్థలంలో గద్దర్‌జానపద కళాక్షేత్రం ఏర్పాటుచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జజ్జనక కళా మండలి కన్వీనర్ బంటు వెంకటేష్, దళిత సంఘాల అధ్యక్షులు కెడి.రమేష్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితులు

మల్కాజిగిరి: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని మల్కాజిగిరి పోలీసులు అరెస్ట్ చేశారు.ఇన్‌స్పెక్టర్ బి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..మౌలాలికి చెందిన దుబ్బాకుల మహేష్(23), స్నేహితుడు అడబాల నాగరాజు(24) ఇద్దరూ గత నెల 25 వ తేదీన నాగపూర్‌కు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు కిలోన్నర గంజాయి తీసుకొని వచ్చారు.విశ్వసనీయ సమాచారంతో శుక్రవారం మౌలాలి ప్రాంతంలో గంజాయి విక్రయిస్తుండగా వారితో పాటు కొనుగోలు చేయడానికి వచ్చిన వంగ మోహన్(24),సాయికుమార్(25)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పక్కాగా లెక్క!

- జీఐఎస్ సాంకేతికతతో ఇళ్ల మ్యాపింగ్
- నగర శివారు 29 పురపాలికల్లో సర్వేకు సిద్ధం
- భవనాలు పన్ను పరిధిలోకి వచ్చేలా కసరత్తు
- సర్వేతో అన్నీ సునాయసంగా గుర్తింపు
- డిజిటల్ రికార్డుల నిర్వహణతో ఆదాయం పెంపు

సాక్షి, మేడ్చల్ జిల్లా: నగర శివారు పురపాలికల్లో జీఐఎస్(జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం) సాంకేతికతతో సర్వే చేపట్టేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఇళ్ల మ్యాపింగ్ చేయాలని నిర్ణయించిన కేంద్ర సర్కారు తాజాగా పురపాలికలకు సూచన చేసింది. తాజాగా చేపట్టే సర్వేతో భవన నిర్మాణాల సంఖ్య, అనుమతులకు అనుగుణంగా నిర్మించారా లేదా..? అనే విషయాలు తేటతెల్లమవుతాయి. డిజిటల్ రికార్డుల నిర్వహణతో పురపాలికలకు ఆదాయం పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయి.

సులభంగా తెలుసుకునేలా..

నగరాలు పట్టణాల్లో వరద కాల్వలు, రహదారులు, తాగునీటి బోర్ల మార్గాల వ్యవస్థ అపార్టుమెంట్లు, ఉద్యానాలు, పచ్చదనం, వాణిజ్య సముదాయాలు ఇతర సమాచారం జీఐఎస్ సాంకేతికత సాయంతో గుర్తిస్తారు. నగరాలు, పట్టణాల్లో వివిధ డివిజన్లు/వార్డుల్లో ఇంటి నంబర్లు, ఆయా కాలనీలను గుర్తించేలా సర్వే నిర్వహిస్తారు. ప్రతి ఇంటిని సమీపంలో నుంచి చూసిన రీతిలో 3డీ పటాలు ఉంటాయి. ఆన్‌లైన్ క్లిక్ చేయగానే భవన నిర్మాణ రూపం కళ్ల ముందు కనిపించేలా మ్యాపింగ్‌లో పొందుపరుస్తారు. ఎంత మేర విస్తీర్ణంలో భవన నిర్మాణం ఉందో తెలుసుకునే వీలుంది.

పన్ను పరిధిలోకి వచ్చేలా..

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లా పరిధిలోని 29 పుర పాలక సంఘాల్లో ఏళ్ల నుంచి అనేక నిర్మాణాలు వెలుస్తున్నా.. ఆస్తి పన్ను ఎగవేస్తున్నారు. వ్యాపార, వాణిజ్య, పరిశ్రమలు, విద్యాసంస్థలకు సంబంధించి ఆస్తిపన్ను విషయంలో ఎగవేతలు అధికంగా ఉన్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి. తాజాగా చేపట్టనున్న సర్వేతో పురపాలికల రికార్డుల్లో ప్రతి నిర్మాణాన్ని పొందుపరిచేలా అధికార యంత్రాంగం దృష్టి సారిస్తోంది. భవనాల స్వరూపంతో ఆయా ప్రాంతాల్లో గూగుల్ మ్యాప్ ద్వారా వివరాలను కేంద్ర, రాష్ట్రస్థాయిలో చేపట్టే చర్యలపై అప్పటికప్పుడు నివేదిక సిద్ధం చేసే అవకాశాలు ఉన్నాయి. వరద నీటి కాల్వలు, ఉద్యానాలు, రోడ్ల పరిధి, పారిశ్రామిక వాడలు ఏ విధంగా ఉండాలో నిర్ణయం తీసుకునే వీలుంది.

భువన్ సర్వే మాదిరిగానే..

గతంలో నిర్వహించిన భువన్ సర్వే మాదిరిగానే నగర శివారు పురపాలికల్లో సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్న అధికార యంత్రాంగం సిబ్బందికి కూడా అవగాహన కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. నిర్మాణాలు సజావుగా ఉండేలా, ప్రణాళికయుతంగా విధానాల రూపకల్పనకు జీఐఎస్ సాంకేతికతో చేపట్టనున్న సర్వే ఎంతో వీలుగా ఉంటుందని పేర్కొంటున్నారు.

విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కాప్రా: సైనిక్‌పురి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం పలు కాలనీలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ నరేందర్ తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఓయూటీ కాలనీ, భాస్కర్‌రావునగర్, ఈశ్వరపురి కాలనీ, ఎస్‌బీఓ కాలనీ, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు హనుమాన్‌నగర్, వినయ్‌నగర్, అరుణ్‌నగర్, శ్రీనగర్ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు పేర్కొన్నారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

బోడుప్పల్: రా చెరువు, అల్మాస్‌కుంట, సుద్దకుంట్ పరిసర ప్రాంతాల్లో చెత్త చెదారం వేస్తున్నారని, వేయకుండా ఉండే విధంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ బోడుప్పల్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రతినిధులు దొంతి పవన్‌కుమార్, దొంతి నవీన్ ముదిరాజ్‌లు కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. చెరువులు, కుంటల్లో చెత్తా, చెదారం వేయడం వల్ల జల కాలుష్యం ఏర్పడి చేపలు చనిపోతున్నాయన్నారు. కమిషనర్ స్పందించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, డైమెన్షన్స్ మ్యాప్‌లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

సత్కారం



మోహన్‌ను సత్కరిస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్: టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర కన్వీనర్‌గా నియమితులైన హెచ్‌ఆర్ మోహన్‌ను నాచారం హనుమాన్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్, బస్తీ వాసులు ఘనంగా సత్కరించారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు. హెచ్‌ఆర్ మోహన్ మాట్లాడుతూ పదవితో మరింత బాధ్యత పెరిగిందన్నారు.

నియామకం




మల్లాపూర్: టీపీసీసీ లేబర్ సెల్ ఉపాధ్యక్షుడిగా నాచారం సావర్కనగర్‌కు చెందిన వీఎస్ ప్రకాష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ లేబర్ సెల్ చైర్మన్ ఆర్.ప్రకాష్‌గౌడ్ నియామకపు ఉత్తర్వులను అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్య ప్రదాతలు



రామంతాపూర్ : రాంశంకర్‌నగర్‌లో శుక్రవారం స్థానికంగా పనిచేసే జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులను కార్పొరేటర్ బండారు శ్రీవాణి, వెంకట్ రావు భగవద్గీత గంగాధర్ శాస్త్రిలు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ప్రజల ఆరోగ్య ప్రదాతలని వీధుల్లో రోడ్లలో పేరుకుపోయిన చెత్తను ఉదయం నుండే శుభ్రపరుస్తూ ప్రజలకు ఆరోగ్యాన్ని అందిస్తున్నారని అన్నారు.

రోడ్డు మరమ్మతులకు చర్యలు



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న అంతర్గత రోడ్డు మరమ్మత్తు పనులను శుక్రవారం జీహెచ్ఎంసీ మల్కాజిగిరి సర్కిల్ డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతిలు పరిశీలించారు. డివిజన్ పరిధిలో రోడ్డు మరమ్మత్తులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ కార్మికుల సంక్షేమానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరామ్

రామంతాపూర్ : గాంధీనగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం గ్రేటర్ హైదరాబాద్ జీహెచ్ఎంసీ ఎంటమాలజీ కార్మిక సంఘం నిర్వహించిన సమావేశానికి తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా టీఆర్ఎస్ పాలనలో జీహెచ్ఎంసీ కార్మికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివిధ విభాగాల్లో ఎన్నో ఏళ్ళుగా తాత్కాలిక కార్మికులుగా పని చేస్తున్న వారిని చేసే విధంగా త్వరలోనే మున్సిపల్ శాఖ మంత్రినికలిసి కృషి చేస్తానన్నారు. దోమల నివారణకు కృషి చేస్తున్న ఎంటమాలజీ కార్మికుల సమస్యలు పరిష్కరించి వారి వారి ఉద్యోగాలను కూడా పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతానని తెలిపారు. జేఏసీ చైర్మన్ డాక్టర్ తిప్పర్తి యాదయ్య, ఎస్‌కె రసూల్ భాషా, బీమనపల్లి పరమేష్, స్వామి, మల్లేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి..



క్రీడలను ప్రారంభిస్తున్న రైల్వే విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు కోమట్ల విజయప్రసాద్‌రెడ్డి

గౌతంనగర్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రైల్వే విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు కోమట్ల విజయప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి మల్లిఖార్జుననగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ గ్రౌండ్‌లో సెవెన్ హిల్స్ పాఠశాల నిర్వాహకులు శేష సాయి ఆధ్వర్యంలో స్పోర్ట్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైల్వే విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు కోమట్ల విజయప్రసాద్‌రెడ్డి హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి వారి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలంటే ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల కృషి కూడా అత్యంత కీలకమన్నారు.

సరిహద్దు వివాదానికి పరిష్కారం చూపిన కార్పొరేటర్



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: గత కొంత కాలంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని ఐజీకే కాలనీ, విద్యామారుతీ కాలనీల నడుమ నెలకొన్న సరిహద్దు వివాదానికి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పరిష్కారం చూపారు. విద్యామారుతీ కాలనీలో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం పనుల్లో చేపట్టే క్రమంలో ఇరు కాలనీలవారికి వివాదం నెలకొంది. వివాదం కారణంగా పనులు నిలిచిపోవడంతో కార్పొరేటర్ కల్పించుకొని రెండు కాలనీలవాసులతో మాట్లాడి సయోధ్య కుదిర్చింది. దీంతో పైప్‌లైన్ పనులకు లైన్ క్లియర్ అయింది.

విద్యుత్ సిబ్బందితో సమీక్ష..

డివిజన్‌లో నెలకొన్న విద్యుత్ సమస్యలపై విద్యుత్‌శాఖ సిబ్బందితో శుక్రవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సమీక్ష నిర్వహించారు. కరంట్‌పోల్స్ అవసరమైన కొత్త కాలనీలతో పాటుగా లో వొల్టేజీ, కొత్త విద్యుత్ లైన్లు, చేపట్టాల్సిన మరమ్మత్తులపై వారితో మాట్లాడి సూచనలు చేశారు.

కరెంట్ మీటర్ల సర్వీసులకు ఫోన్ నంబర్ లింక్‌చేసుకోవాలి

బోడుప్పల్: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ మీటర్ల సర్వీసులకు తమ యొక్క ఫోన్ నంబర్‌ను లింక్ చేసుకోవాలని బోడుప్పల్ ఏఈ మైలారం స్వామి వెల్లడించారు. బోడుప్పల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫోన్ నంబర్ లింక్ చేసుకోవడం వల్ల విద్యుత్ బిల్లుల సమాచారం మెసేజ్ ద్వార వస్తుందని, విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు పవర్ కట్ అయితే సమాచారం, బిల్లులు చెల్లింపుల వివరాలు మెసేజ్ రూపంలో వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ తమ విద్యుత్ మీటర్లను ఫోన్ ద్వార లింక్ చేసుకోవాలని ఆయన కోరారు.

రైల్వే స్టేషన్ వద్ద అభివృద్ధి పనుల పరిశీలన



మల్కాజిగిరి రైల్వే స్టేషన్ వద్ద పనులను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

గౌతంనగర్: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా మల్కాజిగిరి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను శుక్రవారం హైదరాబాద్ డివిజన్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ అజిత్‌కుమార్ సింగ్, డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ శివరాంలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రైల్వే స్టేషన్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పనులను వేగవంతం చేయాలని వారు అధికారులకు సూచించారు. డీఆర్‌యూసీసీ సభ్యుడు, సబర్బన్ ట్రావెల్లర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నూర్, రైల్వే అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.